సాక్షి
రాజన్న సిరిసిల్ల
సోమవారం। 18 । డిసెంబర్ । 2023



రాజన్నకు కోడెమొక్కులు

వేములవాడ: రాజన్నను ఆదివారం 25 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. వివిధ ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. 8లో



ఘనంగా పెన్షనర్స్ డే

సిరిసిల్లటౌన్: జాతీయ పెన్షనర్స్ డే వేడుకలు సిరిసిల్లలో ఆదివారం నిర్వహించారు. టౌన్ సీఐ ఉపేందర్ ముఖ్య అతిథిగా హాజరై వంద మంది రిటైర్డ్ ఉద్యోగులను సన్మానించారు.

గరిష్ఠం/కనిష్ఠం
28.0/18.0

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. వర్షం కురిసే అవకాశం లేదు. రాత్రి వేళ చలిగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

విలాసాగర్‌లో వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర



బోయినపల్లి(చొప్పదండి): మండలంలోని విలాసాగర్‌లో ఆదివారం వికసిత్ భారత్ సంకల్ప్‌యాత్ర చేపట్టారు. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. తెలంగాణ సాంస్కృతిక సారధి కళాబృందం గేయాల ద్వారా వివరించారు. ఎంపీడీవో రాజేందర్‌రెడ్డి, సర్పంచ్ జూలపల్లి స్వప్నాంజలి, ఉపసర్పంచ్ రాములు, ఎంఏవో ప్రణిత, ఎంపీవో గంగాతిలక్ ఉన్నారు.

డే కేర్ సెంటర్‌కు వృద్ధురాలి తరలింపు



ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలకేంద్రంలోని సాయిబాబా ఆలయంలో మూడు రోజులుగా తలదాచుకుంటున్న వృద్ధురాలిని ఆదివారం స్థానిక డేకేర్ సెంటర్‌కు తరలించారు. అనారోగ్యంతో బాధపడుతున్న వృద్ధురాలికి వైద్యం అందించారు. మండలంలోని రాచర్లగొల్లపల్లికి చెందిన తీగల చంద్రవ్వ భర్త బ్యాంక్ ఉద్యోగిగా పనిచేసేవాడు. భర్త గతంలోనే మృతిచెందగా.. సంతానం లేకపోవడంతో ముథోల్‌లోని తన చెల్లెలు వద్ద ఇన్ని రోజులు ఉంది. వారు ఇంటి నుంచి పంపించి వేయడంతో మూడు రోజులుగా స్థానిక సాయిబాబా ఆలయంలో తలదాచుకుంటోంది. అయ్యప్పమాలధారులు పెట్టే భోజనం తింటూ కాలం గడిపింది. విషయం తెలుసుకున్న మాజీ ఎంపీటీసీ బాల్‌రాజ్, సెస్ ఉద్యోగి సతీశ్ వృద్ధురాలిని డేకేర్ సెంటర్‌కు తరలించారు.

కేటీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం



సిరిసిల్లటౌన్: ప్రజాసంక్షేమ పాలనపై అసెంబ్లీలో సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ ప్రసంగం అందరికీ ఆమోదయోగ్యమని బీఆర్‌ఎస్ యూత్ పట్టణాధ్యక్షుడు మనోజ్‌కుమార్ పేర్కొన్నారు. అసెంబ్లీలో కేటీఆర్ ప్రజాసమస్యలు ప్రస్తావించడాన్ని హర్షిస్తూ అంబేడ్కర్ చౌరస్తాలో కేటీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. మునీర్, వరుణ్, మన్సూర్, అఖిల్, జాఫర్, హరీశ్, సాయి, సికింధర్, అఫ్రోజ్, ప వన్, ఇమ్రాన్, సల్మాన్, యాదగిరి పాల్గొన్నారు.

'గుర్తింపు లేనందుకే పార్టీని వీడుతున్నాం'



మంజుల దంపతులు

తంగళ్లపల్లి(సిరిసిల్ల): తంగళ్లపల్లి జెడ్పీటీసీ పూర్మాని మంజులరెడ్డి ఆమె భర్త బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు, జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు పూర్మాని రాంలింగారెడ్డి ఆదివారం బీఆర్‌ఎస్ పార్టీకి రాజీనామా చేశారు. జెడ్పీటీసీ మంజులరెడ్డి మాట్లాడుతూ బీఆర్‌ఎస్‌లో తగిన గుర్తింపు లేనందున పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. తన భర్త రాంలింగారెడ్డి 2001 నుంచి పార్టీకి కట్టుబడి పనిచేస్తున్నారని.. తాను 2010 నుంచి క్రియాశీలకంగా పనిచేస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. పదవిని అడ్డుపెట్టుకొని ఆస్తులు కూడబెట్టుకోలేదని తమ ఆస్తులే అమ్ముకున్నామన్నారు. ఏ పార్టీలో చేరేది త్వరలో ప్రకటిస్తామని పేర్కొన్నారు.

తెలుగు సాహిత్య కళోత్సవాల్లో యువకవి



ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలో ఆదివారం నిర్వహించిన ప్రపంచ తెలుగు సాహిత్య కళోత్సవాల్లో జిల్లాకు చెందిన యువకవి కట్ల శ్రీనివాస్ పాల్గొన్నారు. తన కవితను పఠనం చేసి అందరి ప్రశంసలు అందుకున్నారు. సాహితీవేత్తల చేతులమీదుగా సన్మానం అందుకున్నారు. మండలంలోని బాకూర్‌పల్లికి చెందిన యువకవి ప్రపంచ తెలుగు సాహిత్య కళోత్సవాల్లో పాల్గొనడం తమకు గర్వంగా ఉందని ఆ గ్రామ సర్పంచ్ పడిగెల రవీందర్ ఉన్నారు.

శివారు.. చిమ్మచీకట్లు

- ఆధ్యాత్మిక క్షేత్రం చుట్టూ అంధకారం
- ప్రమాదకరంగా వేములవాడ బైపాస్‌రోడ్లు
- తరచూ ప్రమాదాలు.. ప్రాణాలు కోల్పోతున్న అమాయకులు
- డివైడర్లు నిర్మించి సెంట్రల్‌లైటింగ్ మరిచి
- పట్టించుకోని అధికారులు
- భయాందోళనలో స్థానికులు, భక్తులు



అంధకారంలో వేములవాడ బైపాస్‌రోడ్డు

వేములవాడఅర్బన్: ఆధ్యాత్మికక్షేత్రం వేములవాడ శివారుకాలనీల్లో చిమ్మచీకట్లు అలుముకున్నాయి. దక్షిణకాశీగా ప్రసిద్ధి చెందిన వేములవాడ చుట్టూ అందమైన బైపాస్‌రోడ్లు ఉన్నాయి. అయితే బైపాస్‌రోడ్లపై లైట్లు వెలగడం లేదు. ఫలితంగా రాత్రి వేళ చిమ్మచీకట్లు పరుచుకుంటున్నాయి. రాత్రి వేళ అటువైపుగా ద్విచక్రవాహనాలపై ప్రయాణించే వారు చీకటిగా ఉంటుండడంతో భయాందోళన చెందుతున్నారు.

అయోమయంలో భక్తులు

రాజన్న దర్శనానికి వచ్చే భక్తులు సాధారణంగా రాత్రి వేములవాడలో నిద్ర చేయాలని విశ్వసిస్తుంటారు. ఇందుకు అనుగుణంగా వారి స్వస్థలాల నుంచి సాయంత్రం బయలుదేరి రాత్రి పొద్దుపోయాక ఇక్కడికి చేరుకునేలా ప్రణాళికలు వేసుకుంటారు. రాజన్న దర్శనానికి వచ్చే భక్తుల్లో అత్యధికులు ఇలాగే వస్తుంటారు. అయితే రాత్రి పొద్దుపోయాక వేములవాడకు చేరుకుంటున్న వారు వసతి గదుల కోసం ప్రైవేట్ వ్యక్తులను ఆశ్రయిస్తుంటారు. ప్రైవేట్ వసతిగృహాలు ఆలయానికి దూరంగా.. బైపాస్‌రోడ్ల వెంట ఉన్నాయి. అయితే ఆ ప్రాంతంలో చిమ్మచీకట్లు ఉంటుండడంతో భక్తులు భయాందోళన చెందుతున్నారు. అసలే కొత్త ప్రాంతం కావడం, ఆపై వీధిదీపాలు వెలుగకపోవడంతో దొంగలు, ఆకతాయిలు ఉంటారనే భయాందోళన చెందుతున్నారు. దీనికితోడు పలువురు యువకులు రాత్రి వేళ ఎక్కువ శబ్దాలు వచ్చే బైక్‌లపై అతివేగంగా వెళ్తుండడంతో వారిని మరింత ఆందోళనకు గురిచేస్తుంది. బైపాస్‌లో రాత్రి వేళ అనేక ప్రమాదాలు సైతం జరిగాయి.

బైపాస్‌లో చీకట్లు

- వేములవాడ పట్టణం మూలవాగు బ్రిడ్జి నుంచి రాజన్న గుడిచెరువు కట్టకింద జగిత్యాల బస్టాండ్ వరకు మొదటి బైపాస్‌రోడ్డును ఏర్పాటు చేశారు. ఈ రోడ్డులో ఆదివారం, సోమవారం ఆలయానికి వచ్చే భక్తుల వాహనాల రద్దీ ఎక్కువగా ఉంటుంది. రాత్రి, పగలు తేడా లేకుండా వాహనాల రాకపోకలు ఉంటాయి. ఈ రోడ్డును ఫోర్‌లేన్ చేసి మధ్యలో డివైడర్ నిర్మించి మొక్కలను ఏర్పాటు చేశారు. కానీ సెంట్రల్ లైటింగ్ మాత్రం పెట్టలేదు. దీంతో రాత్రిపూట ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఇటీవల చాలా ప్రమాదాలు జరిగాయి.
- మూలవాగు బ్రిడ్జి నుంచి మల్లారం రోడ్డు వరకు రెండో బైపాస్‌రోడ్డును ఏర్పాటు చేశారు. ఈ రహదారిని కూడా ఫోర్‌లేన్ చేసి డివైడర్ మధ్యలో మొక్కలు నాటారు. కానీ సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయలేదు. ఇక్కడ కూడా రాత్రిపూట వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. సాయిరక్ష నుంచి చెక్కపల్లిరోడ్డు వరకు బైపాస్‌రోడ్డు ఏర్పాటు చేసినప్పటికీ సెంట్రల్ లైటింగ్ లేదు. ఇప్పటికైనా అధికారులు పట్టించుకొని వేములాడ చుట్టూ ఉన్న బైపాస్‌రోడ్ల వెంట సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాలని పట్టణవాసులు, భక్తులు కోరుతున్నారు.

ప్రమాదాలు జరుగుతున్నాయి



వేములవాడ పట్టణ శివారులోని బైపాస్‌రోడ్డులో సెంట్రల్ లైట్లు లేకపోవడంతో రాత్రి పూట చీకట్లు ఉంటున్నాయి. రాత్రి పూట రోడ్డుపై ఏమి కనిపించక వాహనదారులు డివైడర్‌ను ఢీకొట్టుకున్న సంఘటనలు ఉన్నాయి. ఇలా చాలా మంది ప్రాణాలు కోల్పోయారు.

– కృష్ణ, వేములవాడ

చీకటిగా ఉంటుంది



వేములవాడలోని బైపాస్ రోడ్లు మొత్తం చీకటిగా ఉంటుంది. రాత్రిపూట పాదచారులకు ఇబ్బందిగా మారింది. వాహనాలు వచ్చి ఢీకొట్టే వరకు కనిపించడం లేదు. రహదారులపై సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాలి.

– అంజయ్య, వేములవాడ

సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాలి



వేములవాడ పట్టణం చుట్టూ ఉన్న బైపాస్‌రోడ్లపై సెంట్రల్ లైట్లు ఏర్పాటు చేయాలి. సెంట్రల్‌లైటింగ్‌తో చీకట్లు పోయి ప్రమాదాలు జరగకుండా ఉంటుంది. పట్టణం చుట్టూ విద్యుత్‌కాంతులతో వెలిగిపోతుంది.

– శ్రీధర్, వేములవాడ

అన్నివర్గాల అభ్యున్నతే లక్ష్యం



సిరిసిల్లలో ఆది శ్రీనివాస్‌కు గజమాలతో స్వాగతం పలుకుతున్న కాంగ్రెస్ నేతలు

- వంద రోజుల్లో ఆరు గ్యారంటీలు అమలు
- సిరిసిల్ల, వేములవాడల్లో సమగ్రాభివృద్ధి
- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్
- జిల్లాలో ఘన స్వాగతం

సిరిసిల్ల: అన్ని వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ పనిచేస్తుందని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. ప్రభుత్వ విప్‌గా నియమితులైన తరువాత తొలిసారి జిల్లాకు వచ్చిన ఆయనకు ఆదివారం సిరిసిల్లలో ఘనస్వాగతం లభించింది. అంబేడ్కర్ సర్కిల్ వద్ద ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీలను వంద రోజుల్లో అమలు చేస్తామన్నారు. ఇప్పటికే మహాలక్ష్మి పథకాన్ని ప్రారంభించి ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణాన్ని, రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకాన్ని రూ.10 లక్షలకు పెంచామని గుర్తు చేశారు. సిరిసిల్ల, వేములవాడల్లో సమగ్రంగా అభివృద్ధి కొనసాగుతుందని స్పష్టం చేశారు. గంజాయి రహిత రాష్ట్రాన్ని సాధించే దిశగా సీఎం రేవంత్‌రెడ్డి ముందుకు సాగుతున్నారని, దీనికి అందరూ సహకరించాలని కోరారు. 15 రోజులకే కాంగ్రెస్ పార్టీపై బురదజల్లే ప్రయత్నాలు చేయడం సరికాదన్నారు. ప్రగతిభవన్‌ను పేదల భవన్‌గా మార్చామని దీంతో బీఆర్‌ఎస్ పార్టీ ఉలికిపడుతుందన్నారు. రాజన్నసిరిసిల్ల జిల్లా సమగ్ర అభివృద్ధికి కె.కె.మహేందర్‌రెడ్డితో కలిసి ముందుకు సాగుతామని వెల్లడించారు. చొప్పదండి ప్రకాశ్, నాగుల సత్యనారాయణగౌడ్, సంగీతం శ్రీనివాస్, ఆకునూరి బాలరాజు, కె.చక్రధర్‌రెడ్డి, గడ్డం నర్సయ్య, వైద్య శివప్రసాద్, మ్యాన ప్రసాద్, గోలి వెంకటరమణ, కాముని వనిత, మడుపు శ్రీదేవి, ఆడెపు చంద్రకళ, కె.జగన్‌మోహన్‌రెడ్డి, పి.లింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



నేరెళ్ల బాధితులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే, విప్ ఆది శ్రీనివాస్

సిరిసిల్లలో బైక్‌ర్యాలీ

సిరిసిల్లలోని కొండాలక్ష్మణ్ బాపూజీ సర్కిల్ నుంచి నేతన్నచౌక్, రగుడు సర్కిల్ వరకు భారీ బైక్‌ర్యాలీ నిర్వహించారు. గజమాలతో స్వాగతం పలికారు. రేణుకాదేవి ఆలయంలో పూజలు నిర్వహించిన అనంతరం సిరిసిల్ల పట్టణంలో రోడ్ షో నిర్వహించారు. కొండా లక్ష్మణ్ బాపూజీ, గాంధీ, అంబేడ్కర్, నేతన్నల విగ్రహాలకు పూలమాలలు వేశారు. జై కాంగ్రెస్.. జై రేవంత్‌రెడ్డి నినాదాలతో సిరిసిల్ల మారుమోగింది. మానేరు వంతెనపై, మొదటి బైపాస్ రోడ్డులో ట్రాఫిక్ నిలిచిపోయింది. సిరిసిల్ల టౌన్ సీఐ ఉపేందర్, ఎస్సై రాజు ట్రాఫిక్‌ను మళ్లించారు.

నేరెళ్ల బాధితులకు న్యాయం చేస్తాం

తంగళ్లపల్లి(సిరిసిల్ల): నేరెళ్ల బాధితులకు కాంగ్రెస్ ప్రభుత్వం న్యాయం చేస్తుందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ హామీ ఇచ్చారు. నేరెళ్ల ఘటనలో బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు. తంగళ్లపల్లి మండలం నేరెళ్లలో బాధితులను పరామర్శించి మాట్లాడారు. సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి మహేందర్‌రెడ్డి, బాధితులు కోల హరీశ్, పెంట బానయ్య, బాలరాజు, ఈశ్వర్, గోపాల్ తదితరులు ఉన్నారు.

అప్పులతో సంపద సృష్టించాం



మాట్లాడుతున్న మాజీ ఎంపీ వినోద్‌కుమార్

- ఆదాయంలో తెలంగాణ అగ్రస్థానం
- ఇతర రాష్ట్రాలు దరిదాపుల్లో లేవు
- అగ్రరాజ్యాలు కూడా అప్పులు చేశాయి
- మాజీ ఎంపీ బి.వినోద్‌కుమార్


సిరిసిల్ల: ఆదాయ వనరుల్లో తెలంగాణ అగ్రస్థానంలో ఉందని, అప్పులతో సంపద సృష్టించామని మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ పేర్కొన్నారు. సిరిసిల్లలోని తెలంగాణ భవన్‌లో ఆదివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సొంత ఆదాయ వనరులు కలిగి ఉండడంలో రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా విడుదల చేసిన ఎస్‌వోటీఆర్ ప్రకారం తెలంగాణ 84.2 శాతంతో దేశంలోనే రెండో స్థానంలో నిలిచిందన్నారు. మొదటి స్థానంలో హర్యానా 86.9 శాతంతో ఉందని వివరించారు. అదే బీహార్ 29 శాతంతో ఉందని తెలిపారు. ఆదాయ వనరులున్న తెలంగాణను అప్పులపాలు చేశారని కాంగ్రెస్, బీజేపీలు ఆరోపించడాన్ని ఖండించారు. రాష్ట్రాన్ని రూ.5లక్షల కోట్ల అప్పుల పాలు చేశారని పదే పదే ఎన్నికల ప్రచారంలో చెప్పారన్నారు. కేంద్ర ప్రభుత్వంతో సహా.. అభివృద్ధి చెందిన దేశాలు అమెరికా, జపాన్, చైనాలు కూడా అప్పులు చేశాయని వివరించారు. అప్పుల సంగతిని చెబుతున్న బీజేపీ, కాంగ్రెస్ నాయకులు తెలంగాణలో పెరిగిన ఆస్తుల విషయాలను ఎందుకు చెప్పడం లేదని ప్రశ్నించారు. 40 ఏళ్ల కిందట టీవీ కొనేందుకు మా కుటుంబం కూడా అప్పులు చేసిందని, నెలనెలా ఈఎంఐ చెల్లించామని వినోద్ కుమార్ గుర్తుచేశారు. రాష్ట్రంలో 39 మంది ఎమ్మెల్యేలతో బలమైన ప్రతిపక్షంగా బీఆర్‌ఎస్ పార్టీ ఉందని, పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థులు గెలుస్తారనే ధీమాను వ్యక్తం చేశారు. రాష్ట్రాన్ని బంగారుపళ్లెంలో పెట్టి అప్పగించామనే మాటకు కట్టుబడి ఉన్నామని, దీనిపై ఏ చర్చకైనా సిద్ధమని స్పష్టం చేశారు. జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళాచక్రపాణి, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, బీఆర్‌ఎస్ నాయకులు బండ నర్సయ్యయాదవ్, జిందం చక్రపాణి, గజభీంకార్ రాజన్న, బొల్లి రామ్మోహన్, జక్కుల నాగరాజుయాదవ్, లింగంపల్లి సత్యనారాయణ, ఎండీ సలీం పాల్గొన్నారు.

పరామర్శ..

మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ తవుటు కనకయ్య ఇటీవల మరణించగా ఆయన కుటుంబాన్ని వినోద్‌కుమార్, టెస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు పరామర్శించారు. కనకయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. సిరిసిల్ల 34వ వార్డు కౌన్సిలర్ దార్ల కీర్తన తండ్రి వీరేశం ఇటీవల మరణించగా.. ఆమె ఇంటికెళ్లి పరామర్శించారు.

క్లిక్ చేస్తే ఖతమే..

- ఫేక్ వెబ్‌సైట్స్‌తో నగదు అపహరణ
- పేట్రేగిపోతున్న సైబర్ మోసగాళ్లు
- ఇటీవల జిల్లాలో పెరిగిన బాధితులు
- అప్రమత్తతతోనే మోసాలకు చెక్
- సైబర్ బాధితులు 1930లో ఫిర్యాదు చేయండి
- ఎస్పీ అఖిల్‌మహాజన్



సిరిసిల్లక్రైం: సైబర్ మోసగాళ్లు రెచ్చిపోతున్నారు. ఫేక్ వెబ్‌సైట్స్ పేరుతో నగదు అపహరిస్తున్నారు. ఫర్నీచర్.. ఎలక్ట్రానిక్ వస్తువులపై భారీ ఆఫర్లు ఇస్తున్నామంటూ ఫేక్ వెబ్‌సైట్లతో బురిడీ కొట్టిస్తున్నారు. నమ్మి వాటిపై క్లిక్ చేస్తే చాలు మన ఖాతాలోని డబ్బు మాయమవుతుంది. ఇటీవల జిల్లాలో సైబర్ మోసాలు వరుసగా జరుగుతున్నాయి. సోషల్‌మీడియాలో వస్తున్న ఆఫర్లకు ఆకర్షితులై అమాయకులు డబ్బులు పోగొట్టుకుంటున్నారు.

జిల్లాలో ఇటీవల జరిగిన సంఘటనలు

- సిరిసిల్లటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఒకరికి క్రెడిట్‌కార్డ్ ప్రొటెక్షన్ ప్లాన్ గురించి ఓ కాల్ వచ్చింది. బాధితులు అతనితో క్రెడిట్‌కార్డ్ నంబర్, ఓటీపీ షేర్ చేసుకోవడంతో రూ.77వేలు నష్టపోయాడు.
- సిరిసిల్లటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఒకరు ఇన్‌స్టాగామ్‌లో ఓ యాడ్ చూసి అందులోని లింక్‌పై క్లిక్ చేయడంతో వాట్సాప్‌కు కనెక్ట్ అయ్యింది. దీంతో బాధితుడు వారు చెప్పినట్లు కొన్ని టాస్క్‌లు చేయడంతో రూ.40వేలు నష్టపోయాడు.
- కోనరావుపేట ఠాణా పరిధిలో ఒకరికి తక్కువకే వజ్రాలు ఇస్తామంటూ ఓ కాల్ వచ్చింది. లోన్ ఇస్తామని చెప్పిన వారు ముందుగా చార్జీలు రూ.27వేలు చెల్లించాలనడంతో పంపాడు. తర్వాత తను మోసపోయానని గుర్తించాడు.
- సిరిసిల్లటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఒకరికి కొత్త నంబర్ నుంచి కాల్ వచ్చింది. వారి మాటలు నమ్మి డెబిట్‌కార్డ్ వివరాలు, ఓటీపీ షేర్ చేసుకోవడంతో రూ.లక్ష వరకు మోసపోయాడు.
- సిరిసిల్ల టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఒకరు నర్సరీ వ్యాపారం కోసం ఫేక్ కస్టమర్ కేర్ సర్వీస్‌ను సంప్రదించాడు. తర్వాత కొత్త నంబర్ నుంచి కాల్ రావడంతోపాటు ఒక పేమెంట్ స్కానర్‌ను పంపించారు. బాధితుడు దాన్ని స్కాన్ చేయడంతో రూ.లక్ష నష్టపోయాడు.
- సిరిసిల్ల టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బిజినెస్ ఎమోషనల్ అని చెప్పి టెలిగ్రామ్‌లో ఒక లింక్ పంపించారు. అందులో భాగంగా కొన్ని టాస్క్‌లు చేస్తే డబ్బు వస్తుందని నమ్మబలికారు. వారు చెప్పినట్లుగా కొన్ని టాస్క్‌లు చేయడంతో కొంత డబ్బు పంపించారు. ఇందులో భాగంగా బాధితుడు రూ.96వేలు నష్టపోయాడు.
- సిరిసిల్ల టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బాధితుడు పార్ట్ టైం జాబ్ గురించి ఒక యాప్‌లో నమోదు చేసుకున్నాడు. ఇందులో భాగంగా వారు ఇచ్చిన వర్క్‌లో డాటా తప్పుగా ఎంటర్ చేశారని బెదిరించి బాధితుడి నుంచి రూ.55వేలు తీసుకున్నారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- సోషల్‌మీడియాలో వచ్చే యాడ్స్‌ను నమ్మొద్దు.
- ఎస్‌బీఐ యోనో బ్లాక్ అయిందని, పాన్‌కార్డు అప్‌డేట్ చేయాలని వచ్చే మెస్సేజ్‌లను నమ్మొద్దు. ఆ మెస్సేజ్‌లలో వచ్చే లింక్స్‌పై అస్సలు క్లిక్ చేయొద్దు.
- సోషల్‌మీడియాలో వచ్చే ప్రకటనలు చూసి పెట్టుబడి పెట్టవద్దు.
- మీ ప్రమేయం లేకుండా మీ సెల్‌ఫోన్ నంబర్‌కు ఓటీపీ వస్తే దాన్ని ఎవరికీ చెప్పొద్దు. అది సైబర్ నేరగాళ్ల ఎత్తుగడగా గమనించాలి.

అప్రమత్తతే అవసరం



కొత్త ఫోన్ నంబర్ నుంచి కాల్ వస్తే ఎలాంటి వ్యక్తిగత వివరాలు చెప్పొద్దు. ఒకవేళ సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930కి కాల్‌చేస్తే తిరిగి డబ్బులు పొందే అవకాశం ఉంది. డెబిట్‌కార్డు, బ్యాంక్ ఖాతా వివరాలు ఎవరితో షేర్ చేసుకోవద్దు.

– అఖిల్‌మహాజన్, రాజన్నసిరిసిల్ల ఎస్పీ

నేరాల నియంత్రణకే కార్డన్‌సెర్చ్

- వన్యప్రాణులను వేటాడితే జైలుకు పంపిస్తాం
- వేములవాడ డీఎస్పీ నాగేంద్రచారి



గంగిరెద్దుల కాలనీలో మాట్లాడుతున్న వేములవాడ డీఎస్పీ నాగేంద్రచారి

చందుర్తి(వేములవాడ): నేరాల నియంత్రణకే కార్డన్ సెర్చ్ నిర్వహిస్తున్నట్లు వేములవాడ డీఎస్పీ నాగేంద్రచారి తెలిపారు. మండలంలోని సనుగుల శివారులోని గెంగిరెద్దులకాలనీలో ఆదివారం తెల్లవారుజాము నుంచే కార్డన్‌సెర్చ్ చేపట్టారు. ఇళ్లలో తనిఖీలు చేపట్టి ధ్రువీకరణ పత్రాలు లేని 15 బైక్‌లతోపాటు వన్యప్రాణులను వేటాడేందుకు వినియోగించే బోనులు, వలలను స్వాధీనం చేసుకున్నారు. డీఎస్పీ నాగేంద్రచారి మాట్లాడుతూ పోలీసులు నిరంతరం శాంతిభద్రతలను కాపాడేందుకు శ్రమిస్తున్నారని, చట్టవిరుద్ధమైన కార్యకలాపాలకు పాల్పడొద్దని సూచించారు. మీ ప్రాంతంలో అనుమానితులు సంచరిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. వన్యప్రాణాలను వేటాడడం మానకపోతే కేసులు నమోదు చేసి జైలుకు పంపుతామని హెచ్చరించారు. మైనర్‌లకు వాహనాలు ఇస్తే వారి తల్లిదండ్రులపైన కేసులు నమోదు చేస్తామన్నారు. చందుర్తి సీఐ అచ్చ కిరణ్‌కుమార్, చందుర్తి, రుద్రంగి ఎస్సైలు సిరిసిల్ల అశోక్, రాజేశ్, ఆర్ఎస్సైలు, డిస్ట్రిక్ట్‌గార్డులు పాల్గొన్నారు.

సర్కారు ఖజానాలో పైసల్లేవ్

- క్రమశిక్షణతో ఆదాయం పెంచుతాం
- పదిరోజుల్లో మరో రెండు గ్యారంటీలు అమలు చేస్తాం
- రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

పెద్దపల్లిరూరల్/సుల్తానాబాద్/కమాన్‌పూర్/రామగిరి/మంథని: ప్రస్తుతం సర్కారు ఖజానాలో పైసల్లేవని, క్రమశిక్షణతో ఆదాయం పెంచుకుంటామని ఐటీ, పరిశ్రమలు, అసెంబ్లీ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు స్పష్టం చేశారు. కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన మాట ప్రకారం పది రోజుల్లో మరో రెండు గ్యారెంటీలు అమలు చేస్తామన్నారు. మంత్రిగా పదవీ ప్రమాణ స్వీకారం చేసిన శ్రీధర్‌బాబు ఆదివారం జిల్లాలో పర్యటించారు. తొలుత సుల్తానాబాద్ మండలానికి చేరుకున్న ఆయన.. పెద్దపల్లి, కమాన్‌పూర్, సెంటినరీకాలనీ మీదుగా మంథని చేరుకున్నారు. అడుగడుగునా ఆయనకు కాంగ్రెస్ శ్రేణులు ఘనస్వాగతం పలికాయి. ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ మంత్రి వెంట ఉన్నారు.

యువతకు ఉద్యోగాలు ఇస్తాం

పెద్దపల్లి రూపురేఖలు మార్చుతామని మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. రామగుండం పారిశ్రామిక ప్రాంత యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు మాట్లాడుతూ నియోజకవర్గానికి మంత్రి శ్రీధర్‌బాబు అండదండలు ఉండాలన్నారు. పెద్దపల్లికి బైపాస్ రోడ్డు, బస్‌డిపో, జిల్లా కోర్టు, 50 పడకల సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి మంజూరు చేయిస్తామన్నారు. స్పందించిన మంత్రి శ్రీధర్‌బాబు.. తామంతా కలిసి జిల్లాను అభివృద్ధి చేస్తామన్నారు.



మంత్రి శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యేలను గజమాలతో సన్మానిస్తున్న కాంగ్రెస్ శ్రేణులు

ప్రజలు శాంతి కోరుకున్నారు..

కమాన్‌పూర్ ఎక్స్ రోడ్డు వద్ద మంత్రి మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో మంథని నియోజకవర్గంలో రౌడీయిజం రాజ్యామేలిందన్నారు. ప్రజలు శాంతియుత వాతావరణం కోరుకుని కాంగ్రెస్‌ను గెలిపించారన్నారు. రాజు, భాస్కర్‌రావు, కోలేటి మారుతి, తిరుపతియాదవ్, ఆకుల ఓదెలు, కట్కం రవీందర్, తొగరి అన్నపూర్ణ పాల్గొన్నారు.

క్లుప్తంగా

అప్పు తీర్చాలని అంత్యక్రియల అడ్డగింత

మెట్‌పల్లి:అప్పు చేసి ఉడాయించిన ఓ వ్యక్తి.. తండ్రి అంత్యక్రియల కోసం రాగా ఆ తంతును అడ్డుకున్న సంఘటన ఆదివారం మెట్‌పల్లి పట్టణంలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. చిట్టీలు, ఫైనాన్స్ వ్యాపారం చేసే చైతన్యనగర్‌కు చెందిన ఓ వ్యక్తి కొంతకాలం క్రితం దివాళాపేరుతో ఇక్కడి నుంచి హైదరాబాద్‌కు ఉడాయించాడు. పలువురి బాధితులకు సుమారు రూ.కోటికి పైగానే చెల్లించాల్సి ఉన్న ఆయన.. కొన్ని నెలల క్రితం తల్లి మరణించడంతో ఇంటికొచ్చాడు. ఆ సమయంలో తమ డబ్బులు తమకు ఇవ్వాలని బాధితులు పట్టుబట్టారు. తొందరలోనే చెల్లిస్తానని హామీ ఇవ్వడంతో ఆ సమయంలో వదిలిపెట్టారు. ఇచ్చిన గడువు ముగిసినప్పటికీ అతని నుంచి స్పందన లేకుండా పోయింది. శనివారం ఆయన తండ్రి చనిపోవడంతో ఆయన అంత్యక్రియల కోసం సదరు వ్యక్తి మళ్లీ ఇక్కడకు వచ్చాడు. దీంతో బాధితులంతా వెళ్లి అతడిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ డబ్బులు ఇచ్చేవరకూ అంత్యక్రియలు జరగనివ్వబోమని తేల్చి చెప్పారు. స్థానిక పెద్దలు జోక్యం చేసుకుని అతనితోపాటు మిగతా కుటుంబ సభ్యులతో బాధితులకు రాత పూర్వక హామీని ఇప్పించడంతో అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఆ తర్వాత అంత్యక్రియల తంతును పూర్తి చేశారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

- 15 రోజుల క్రితం ప్రమాదం


గంగాధర్ (ఫైల్)

రుద్రంగి(వేములవాడ): పదిహేను రోజుల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న రుద్రంగికి చెందిన మోతె గంగాధర్(45) శనివారం అర్ధరాత్రి మృతిచెందాడు. జగిత్యాల జిల్లా కోరుట్ల నుంచి వస్తుండగా కథలాపూర్ మండలం సిరికొండ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. జగిత్యాలలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స తీసుకొని ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యారు. ఇంటి వద్దే ఉంటుండగా శనివారం అర్ధరాత్రి గంగాధర్ మృతిచెందాడు. మృతుడికి భార్య జల, ఇద్దరు కుమారులు నిఖిల్(21), నితిన్(17) ఉన్నారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

- మంచి నివేశన స్థలం రాలేదని మనస్తాపం


చికిత్స పొందుతున్న నాగరాజు

జమ్మికుంట(హుజూరాబాద్): మంచి నివేశన స్థలం రాలేదని మనస్తాపంతో జమ్మికుంట మండలంలోని సైదాబాద్‌కు చెందిన కోలుగూరి నాగరాజు ఆత్మహత్యాయత్నం చేశాడు. బాధితుడి వివరాల ప్రకారం.. నాగరాజు హమాలీ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. గతంలో ఇంటి స్థలం కోసం అతనికి పట్టా మంజూరైంది. కానీ అధికారులు హద్దులు చూపించలేదు. ఈ క్రమంలో సైదాబాద్‌లోని సర్వే నంబర్ 234లో ఇటీవల ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, అధికారుల ఆధ్వర్యంలో మరోసారి డ్రా పద్ధతిలో అర్హులకు నివేశన స్థలాలు కేటాయించారు. అయితే, తనకు వచ్చిన స్థలంలో బండ రాళ్లు, బొందలు ఉన్నాయని, ఇంటి నిర్మాణానికి అనువుగా లేదని నాగరాజు ఆవేదన వ్యక్తం చేశాడు. ఆదివారం సాయంత్రం క్రిమిసంహారక మందు తాగాడు. కుటుంబసభ్యులు జమ్మికుంటలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు. స్థలం కేటాయింపులో తనకు న్యాయం చేయాలని అతను కోరుతున్నాడు.


ప్రభుత్వవిప్ ఆది శ్రీనివాస్‌కు ఆలయ మర్యాదలతో స్వాగతం పలుకుతున్న ఆలయ అధికారులు, అర్చకులు


ఆలయంలో క్యూలైన్లలో భక్తులు

రాజన్నకు కోడెమొక్కులు

వేములవాడ: రాజన్నను ఆదివారం 25 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. సెలవు దినం కావడంతో వివిధ ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలిరావడంతో ఆలయ ఆవరణ రద్దీగా మారింది. రాజన్నను హైదరాబాద్ కలెక్టర్ దుర్శెట్టి అనుదీప్ దంపతులు దర్శించుకున్నారు. కోడె మొక్కు చెల్లించుకున్నారు. ప్రొటోకాల్ పర్యవేక్షకులు శ్రీరాములు ఉన్నారు. రాజన్న దర్శనానికి వీఐపీల సంఖ్య పెరగడంతో పీఆర్వో కార్యాలయాన్ని మూసివేశారు. దీంతో వీఐపీలంతా పీఆర్వో ఆఫీస్ ముందే వేచి చూశారు.

రాజన్నను దర్శించుకున్న ప్రభుత్వ విప్ ఆది

ప్రభుత్వవిప్‌గా నియమితులై మొదటిసారి వేములవాడకు వచ్చిన ఆది శ్రీనివాస్‌ను రాజన్నను దర్శించుకున్నారు. ఆలయ అధికారులు, అర్చకులు వారికి ఘనస్వాగతం పలికారు.


రాజన్నకు కోడె మొక్కు చెల్లించుకుంటున్న హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దంపతులు

మరణంలోనూ వీడని అన్నదమ్ముల అనుబంధం

- లక్కేపూర్ క్రాస్‌రోడ్డు వద్ద బైక్‌ను ఢీకొట్టిన ట్రాక్టర్
- ఘటనా స్థలంలో ఒకరు, ఆస్పత్రిలో మరొకరి దుర్మరణం
- కన్నీటిసంద్రమైన మృతుల కుటుంబసభ్యులు
- తల్లడిల్లిన తల్లి హృదయం.. రోదించిన మంథని


నాగరాజు (ఫైల్)


నవీన్ (ఫైల్)


రోదిస్తున్న కుటుంబసభ్యులు


అగ్గిపట్టిన మృతుల పిల్లలు

మంథని: ఆ కుటుంబంలో నలుగురు అన్నదమ్ములు.. అనూహ్యంగా జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం చెందారు. మలివయసులో అండగా ఉంటారనుకున్న ఇద్దరు కుమారు హఠాత్తుగా చనిపోవడంతో ఆ తల్లి హృదయం తల్లడిల్లిపోయింది. ఈ విషాద సంఘటన మంథనిలో విషాదం నింపింది. పుట్టినప్పుంచి ఎంతో ఆప్యాయంగా పెరిగి వారి బంధాలు.. మరణంలోనూ ఒకటిగా కలిసే పోవడంతో స్థానికులు కన్నీటిపర్యంతమయ్యారు. ఎస్సై కిరణ్ కథనం ప్రకారం.. మంథని పట్టణంలోని సుభాష్‌నగర్‌కు చెందిన తాటి నాగరాజు(42), ఆయన సోదరుడు నవీన్(35) రామగిరి మండలం బేగంపేటకు శనివారం రాత్రి ద్విచక్ర వాహనంపై పనినిమిత్తం వెళ్తున్నారు. అయితే, లక్కేపూర్ క్రాస్ రోడ్డు సమీపంలోకి వెళ్లగానే ఎదురుగా, అతివేగం వచ్చిన ట్రాక్టర్ ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన నవీన్ అక్కడికక్కడే మృతి చెందాడు. నాగరాజును స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అక్కడ మృతి చెందాడు. ప్రమాదానికి కారణమైన అక్కేపల్లి గ్రామానికి చెందిన ట్రాక్టర్‌గా గుర్తించారు. అన్నదమ్ములను ఢీకొట్టిన ట్రాక్టర్ సమీపంలోని ప్లాట్ల వద్ద అదుపుతప్పి పడిపోయినట్లు సమాచారం. ప్లాట్లలో మట్టి పడి ఉంది. ట్రాక్టర్ బోల్తాపడిన ఆనవాళ్లు ఉన్నట్లు స్థానికులు అంటున్నారు. ట్రాక్టర్‌ను సరిచేసుకొని డ్రైవర్ అక్కడి పారిపోయినట్లు భావిస్తున్నారు. కాగా ప్రమాదంలో మృతి చెందిన నాగరాజుకు భార్య, కూతురు(12) ఉన్నారు. అలాగే నవీన్‌కు భార్య, సంవత్సరం, మూడేళ్ల కుమారులు ఉన్నారు. మృతులిద్దరూ డ్రైవర్లుగా పనిచేస్తున్నారు. తల్లి రాధ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై వివరించారు.

కదిలించిన హృదయాలు

మంథని సుభాష్‌నగర్‌కు చెందిన తాటి రాధ–బాపు దంపతులకు నలుగురు కుమారులు. అనారోగ్యంతో బాపు మూడేళ్ల క్రితం మృతి చెందాడు. భర్తను కోల్పోయిన రాధ.. దుఃఖాన్ని కడుపులోనే దాచుకుని తన కుమారులను చూసుకుంటోంది. ఇందులో ఇద్దరు డ్రైవర్లుగా పనిచేస్తుండగా, చిన్న కుమారుడు హైదరాబాద్‌లో ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. మరో కుమారుడు అమాయకుడు కావడంతో ఇంటివద్దే ఉంటున్నాడు. కాగా, నాగరాజుకు కుమారుడు లేడు. దీంతో కూతురుతో చితికి నిప్పంటించారు. అలాగే నవీన్ పెద్దకుమారుడు(3)తో చితికి నిప్పు పెట్టించడంతో అక్కడున్నవారుకన్నీటి పర్యంతమయ్యారు. అందరితో కలివిడిగా ఉండే అన్నదమ్ములు ఒకేరోజు ప్రమాదంలో మృతి చెందడం విషాదం నింపింది.

కొండగట్టులో చందన పూజ


కొండగట్టు ఆలయం

కొండగట్టు(చొప్పదండి):ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కొండగట్టు శ్రీఆంజనేయస్వామి వారి ఆలయంలో త్వరలో చందనోత్సవ పూజకు శ్రీకారం చుట్టనున్నట్లు ఆలయ ఈవో వెంకటేష్ తెలిపారు. వారంలో రెండురోజులపాటు పూజ నిర్వహిస్తారు. స్వామివారికి ప్రతి మంగళ, శనివారాల్లో చందనంతో అర్చకులు ఉదయమే అలంకరించి భక్తులకు దర్శనం కల్పిస్తారు. ఈ పూజలో పాల్గొనాలనుకునే భక్తులు ఒక్కరోజు ముందుగా ఆలయ అధికారులను సంప్రదించాల్సి ఉంటుంది. పూజ టికెట్ ధర సుమారుగా రూ.800 వరకు ఉండనుందని సమాచారం. టికెట్ తీసుకున్న మరుసటి రోజు ఉదయాన్నే భక్తుల పేరు, గోత్రానామాలు చదివి భక్తులకు చందనం (సింధూరం)తో పాటు ప్రసాదం అందజేస్తారు. ఇలా స్వామి వారికి చందనోత్సవం చేయించడం ద్వారా గ్రహపీడలు తొలగడం, చిన్న పిల్లలు అల్లరి మానడం, వ్యాపార అభివృద్ధి, అనుకున్న పనులు పూర్తవడం, చేపట్టిన కార్యాలు దిగ్విజయం అవుతాయని అర్చకులు చెబుతున్నారు. శ్రీరాముడికి ఇష్టమైన చందనం ఆంజనేయస్వామి వారికి నిత్యం అభిషేకం చేయడం ద్వారా ఆయన సంతోషంగా ఉండి కోరికలు తీరుస్తాడని భక్తుల ప్రగాఢ నమ్మకం


శ్రీఆంజనేయస్వామి విగ్రహం

స్వామివారికి ఇష్టం



చందనం అంటే శ్రీరాముడికి ఇష్టం. అందుకే కొండగట్టులో చందన పూజ నిర్వహించాలని నిర్ణయించారు. పూజ చేయడం ద్వారా భక్తులకు నరగోష ఉండదు. కష్టాలు దరిచేరవు. కోరికలు నెరవేరుతాయి.

– జితేంద్రప్రసాద్ స్వామి, కొండగట్టు ఆలయ ప్రధాన అర్చకులు

త్వరలో ప్రారంభం



దేవాదాయ కమిషనర్ ఆదేశాల మేరకు కొండగట్టు ఆలయంలో త్వరలోనే చందన పూజ ప్రారంభిస్తాం. టికెట్ ధరగా రూ.800 వరకు ఉండే అవకాశం ఉంది. చందనపూజలో పాల్గొనే భక్తులు ఒక్కరోజు ముందుగానే ఆలయ అధికారులను సంప్రదించాలి.

– వెంకటేశ్, ఈవో

ఉచిత ఇళ్ల స్థలాల ప్రచారం అవాస్తవం

- భూ సాధన పోరాట కమిటీ అధ్యక్షుడు జక్కనపల్లి గణేశ్

గన్నేరువరం: జగిత్యాల జిల్లా రాజారం శివారులో ఇళ్ల స్థలాలను ఉచితంగా ఇస్తున్నారన్న ప్రచారం అవాస్తమని, దీన్ని నమ్మి అక్కడికి వెళ్లొద్దని భూ సాధన పోరాట కమిటీ అధ్యక్షుడు జక్కనపల్లి గణేశ్ అన్నారు. ఆదివారం గన్నేరువరం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జీవో 58 ప్రకారం ఎలాంటి అభ్యంతరాలు లేని ప్రభుత్వ స్థలంలో అప్పటికే నివాసం ఉంటున్న దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న నిరుపేదలు మాత్రమే ఇంటి స్థలం పొందేందుకు అర్హులని తెలిపారు. స్థిర నివాసాలు లేక, సెంటు భూమి కూడా లేని స్థానికులైన నిరుపేదలకు మొదటి ప్రాధాన్యతగా అధికారులు ఇళ్ల స్థలాలు కేటాయిస్తారని పేర్కొన్నారు. గన్నేరువరం మండలం కరీంనగర్ జిల్లా ప్రాంతమని, జగిత్యాల జిల్లాలోని ప్రభుత్వ భూములను స్థానికేతరులకు ఇచ్చే అవకాశం లేదన్నారు. అవాస్తవ ప్రచారాన్ని నమ్మి ప్రజలు తమ విలువైన సమయాన్ని, డబ్బులను వృథా చేసుకోవద్దని సూచించారు.

అదనపు పనులు కొనసాగేనా?

- ఎన్నికలతో నెల క్రితమే ఆగిపోయిన వైనం
- బిల్లులు ఆగిపోతాయన్న అనుమానంతో నిలిపివేసిన కాంట్రాక్టర్
- రెండు ప్యాకేజీలుగా కాల్వ పనులు
- కాల్వ నిర్మాణంలో 600 ఎకరాలు ముంపు

బోయినపల్లి(చొప్పదండి): కాళేశ్వరం మూడో టీఎంసీ వరదకాల్వ పనులు మరోసారి నిలిచిపోయాయి. అసెంబ్లీ ఎన్నికలు రావడంతో బిల్లులు వస్తాయో.. రావోనని కాంట్రాక్టర్ ముందస్తుగానే పనులు నిలిపివేశాడు. నెల క్రితం ఆగిపోయిన పనులు ఇప్పటికీ ప్రారంభం కాలేదు. కొత్త ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పనులపై నిర్ణయం ఎలా ఉంటుందోననే అనుమానంతో పనులు మళ్లీ మొదలు పెట్టలేదని తెలిసింది.

23 కిలోమీటర్ల మేర వరద కాల్వ

కరీంనగర్ జిల్లా రామడుగు, గంగాధర మండలాల మీదుగా రాజన్నసిరిసిల్ల బోయినపల్లి మండలం వరదవెల్లి క్రాస్ రెగ్యులేటర్ వరకు సుమారు 23 కిలోమీటర్ల మేర అదనపు టీఎంసీ వరద కాల్వ చేస్తున్నారు.

- ఈ కాల్వ నిర్మాణంలో మూడు మండలాల రైతుల భూములు సుమారు 600 ఎకరాలు ముంపునకు గురయ్యాయి. కొంతమంది రైతులకు పరిహారం డబ్బులు రాగా, మరికొందరికి రావాల్సి ఉంది.
- ఈ పనులను రెండు ప్యాకేజీలుగా విభజించారు.
- రామడుగు మండలం శ్రీరాములపల్లి 99 కి.మీ నుంచి 113 కి.మీ వరకు ఒక ప్యాకేజీ, 113 కి.మీ నుంచి 122 కి.మీ వరకు రెండో ప్యాకేజీగా నిర్ణయించారు.
- దాదాపు 120 నుంచి 160 మీటర్ల వెడల్పుతో పాత వరదకాల్వను ఆనుకునే ఎడమ వైపు ఈ పనులు చేస్తున్నారు.
- ఇప్పుడు ఉన్న వరదకాల్వలో సుమారు రెండు టీఎంసీల మేర నీరు నిల్వ ఉంటుంది. అదనంగా మరో టీఎంసీ నీటి నిల్వ కోసం కొత్త కాల్వ పనులు రెండేళ్ల క్రితం ప్రారంభించారు.

పనులు ఇలా..

అదనపు టీఎంసీ కాల్వ నిర్మాణం : 23 కిలోమీటర్లు

కాల్వ వెడల్పు : 120 మీటర్ల నుంచి 160 మీటర్ల వరకు

కాల్వ విస్తరించి ఉన్న మండలాలు : రామడుగు, గంగాధర, బోయినపల్లి

పనులు జరిగినవి : సుమారు యాభై శాతం

యాభై శాతం పూర్తి

అదనపు టీఎంసీ వరద కాల్వ నిర్మాణం పనులు సుమారు 23 కిలోమీటర్ల మేర చేపట్టాలి. రెండు కిలో మీటర్లు తప్ప మిగతా అన్ని చోట్ల పనులు ప్రారంభమైనట్లు తెలిసింది. వరదకాల్వ లోతు సుమారు 34 మీటర్లు, వెడల్పు సుమారు 80 నుంచి వందకుపైగా మీటర్ల మేర ఉంటుంది. పలు ప్రాంతాల్లో సుమారు యాభై శాతం మేర పనులు పూర్తి చేసినట్లు కాంట్రాక్టర్ల ద్వారా తెలిసింది. బోయినపల్లి మండలం దేశాయిపల్లిలో ముంపు ఇళ్ల ప్రాంతం, బీటీ రోడ్డు ఏరియాలో పనులు మొదలుకాలేదు. కొన్ని చోట్ల ఇంకా భూసేకరణ పూర్తి కాకపోవడంతో పనులు ప్రారంభించలేదు.


దేశాయిపల్లి గ్రామ పరిసరాల్లో వరద కాల్వ నిర్మాణం

బిల్లులపై అనుమానంతోనే ఆగిన పనులు ?

రాష్ట్ర ప్రభుత్వం మారడంతో బిల్లులు వస్తాయో.. రావోనని అనుమానంతో కాంట్రాక్టర్ పనులు నిలపివేసినట్లు సమాచారం. ఇప్పటికే పలు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, ఇంకా పనులు చేస్తే ఏమవుతుందోననే భయంతో పనులు పొందిన ఏజెన్సీ కాంట్రాక్టర్లు భావిస్తున్నట్లు సమాచారం. కాగా కొన్ని బిల్లులు పెండింగ్ ఉండడంతోనే పనులు ఆగాయని ఇరిగేషన్ ఇంజినీరింగ్ అధికారులు చెప్పడం కొసమెరుపు.

ఇద్దరు యువకుల అరెస్ట్


పట్టుబడిన యువకులతో పోలీసులు

మెట్‌పల్లి: వేర్వేరు దొంగతనం కేసుల్లో ఇద్దరు యువకులను అరెస్ట్ చేసినట్లు ఎస్సై చిరంజీవి తెలిపారు. పట్టణ శివారులోని వట్టివాగు వద్ద పోలీసులు తనిఖీలు నిర్వహిస్తుండగా.. కోరుట్లకు చెందిన యువకులు తెన్నేరు శ్రీకాంత్, చంద్రగిరి పద్మాకర్ బైక్‌పై అక్కడకు వచ్చారు. అనుమానాస్పదంగా కనిపించిన వారిని సోదా చేయగా.. వారి వద్ద కరిగించిన బంగారం దొరికింది. వెంటనే పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లి విచారణ చేపట్టారు. ఈనెల 3న కళానగర్‌లో వృద్ధురాలి మెడలో నుంచి పుస్తెలతాడు అపహరించినట్లు, జగిత్యాల పట్టణంలోని ఓ ఇంట్లో చోరీకి పాల్పడినట్లు అంగీకరించారు. వారి నుంచి ద్విచక్రవాహనం, రూ.80వేలు, 25గ్రాముల బంగారాన్ని సీజ్ చేసి రిమాండ్‌కు తరలించామని ఎస్సై పేర్కొన్నారు.

మద్యానికి బానిసై వ్యక్తి ఆత్మహత్య

పెద్దపల్లిరూరల్: పట్టణంలోని అమర్‌నగర్ (పాత కోర్టు) సమీపంలో నివాసముండే సామ చంద్రశేఖర్(38) ఆదివారం ఉరిపోసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కొంతకాలం క్రితం చంద్రశేఖర్‌కు వివాహమైంది. ఆ తర్వాత భార్యతో విడాకులు అయ్యాయి. అప్పటినుంచి మద్యానికి బానిసైన చంద్రశేఖర్.. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరిపోసుకొన్నాడని ఎస్సై మల్లేశ్ తెలిపారు. మృతుడి తండ్రి తిరుపతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

రైల్వేస్టేషన్‌లో ప్రమాదవశాత్తు ఒకరి మృతి


రాంసమ్మయ్య (ఫైల్)

జమ్మికుంట(హుజూరాబాద్): స్థానిక రైల్వే స్టేషన్‌లో ప్రమాదవశాత్తు ఓ వ్యక్తి మృతి చెందాడు. రామగుండం రైల్వే పోలీస్ హెడ్‌కానిస్టేబుల్ గంగారపు తిరుపతి వివరాల ప్రకారం.. ఇల్లందకుంట మండలంలోని పాతర్లపల్లికి చెందిన రాంసమ్మయ్య (53) మందమర్రిలోని కూతురు ఇంటికి వెళ్లేందుకు ఆదివారం జమ్మికుంట రైల్వేస్టేషన్‌కు వచ్చాడు. డౌన్ లూప్ లైన్‌లో ఆగి ఉన్న పీఎస్‌ఎస్‌హెచ్ గూడ్స్ రైలు కింద దూరి, 3వ ప్లాట్‌ఫాం పైకి ఎక్కేందుకు ప్రయత్నించగా అదుపుతప్పి కిందపడ్డాడు. ఈ ఘటనలో అతనికి తీవ్ర గాయాలయ్యాయి. 108కు సమాచారం అందించగా సిబ్బంది వచ్చి, మృతిచెందినట్లు తెలిపారు. మృతుడికి భార్య రాధ, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీస్ హెడ్‌కానిస్టేబుల్ పేర్కొన్నారు.

మూసివేసిన బోరుబావిలో పడి మహిళకు తీవ్ర గాయాలు

వీర్నపల్లి(సిరిసిల్ల): మండలంలోని అడవిపదిరలో ఓ పొలంలో మూసివేసిన బోరుబావిలో కాలు పడి ఓ మహిళ తీవ్రంగా గాయపడింది. వెంటనే ఆమెను ఎల్లారెడ్డిపేటలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు. మండలంలోని గర్జనపల్లికి చెందిన గుంటుకు దేవేంద్ర అడవిపదిరలో నాటు వేసేందుకు వెళ్లింది. పొలాన్ని నాటుకు సిద్ధం చేస్తుండగా ట్రాక్టర్ కేజీవీల్ పొలంలోని కేసింగ్‌పైన ఉన్న బండరాయికి తగలడంతో అది తొలగిపోయింది. గమనించకుండా నాటువేస్తున్న దేవేంద్ర కాలు బోరులో పడి ఇరుక్కుంది. తీవ్రంగా గాయపడ్డ దేవేంద్రను వెంటనే ఎల్లారెడ్డిపేటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

'అల్ఫోర్స్'లో మ్యాథ్స్ ఒలింపియాడ్ టెస్ట్


పరీక్షను పర్యవేక్షిస్తున్న విద్యాసంస్థల చైర్మన్ నరేందర్ రెడ్డి

కొత్తపల్లి(కరీంనగర్): కరీంనగర్‌లోని అల్ఫోర్స్ కేంద్ర కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన అల్ఫోర్స్ మ్యాథ్స్ ఒలింపియాడ్ టెస్ట్‌కు స్పందన లభించింది. విద్యాసంస్థల చైర్మన్ నరేందర్‌రెడ్డి గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ చిత్రపటానికి నివాళి అర్పించి, ప్రశ్నాపత్రం విడుదల చేశారు. రాష్ట్రంలోని అల్ఫోర్స్ విద్యాసంస్థల్లో 6 నుంచి 10వ తరగతి వరకు గల విద్యార్థులకు రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన ఈ పరీక్షకు 12,600 మంది హాజరైనట్లు తెలిపారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఈ నెల 22న జాతీయ గణిత దినోత్సవం సందర్భంగా కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ–టెక్నో స్కూల్లో బహుమతి ప్రదానం చేస్తామన్నారు. రామానుజన్ సేవలు స్ఫూర్తిదాయకమని, చిన్న వయసులోనే గణిత శాస్త్రంపై పట్టు సాధించి, అనతికాలంలోనే అద్భుతాలు సృష్టించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో వివిధ పాఠశాలల ప్రిన్సిపాళ్లు, టీచర్లు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

దాడి ఘటనలో ముగ్గురిపై కేసు

జమ్మికుంట(హుజూరాబాద్): భూ వివాదంలో దాడికి పాల్పడిన ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు జమ్మికుంట పట్టణ సీఐ రమేశ్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. జమ్మికుంట మండలంలోని విలాసాగర్‌కు చెందిన రాచపల్లి కుమార్, అతని సోదరులు శంకర్, సతీశ్, మహేందర్‌లకు మధ్య భూ వివాదం ఉంది. దీన్ని మనసులో పెట్టుకున్న ఆ ముగ్గురూ కుమార్, అతని భార్య కవిత ఆదివారం పొలంలో పని చేస్తుండగా వెళ్లి, కర్రలతో దాడి చేశారు. ఈ ఘటనలో బాధితులకు తీవ్ర గాయాలయ్యాయి. కవిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.